ఎడతెరిపిలేని వర్షం

- శనివారం అర్ధరాత్రి భారీ వర్షం
- ఆదివారం సాయంత్రం వరకు జల్లులు
- పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు
- డివిజన్‌లో 42.4 మి.మీ వర్షపాతం నమోదు


నూజివీడులోని జంక్షన్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు

నూజివీడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో నూజివీడు డివిజన్ వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంతో పాటు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వర్షం నీరు వచ్చి చేరింది. డివిజన్ వ్యాప్తంగా సరాసరి 42.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నూజివీడు మండలంలో 48.6 మి.మీ, ఆగిరిపల్లిలో 40.2 మి.మీ, ముసునూరులో 48 మి.మీ, చాట్రాయిలో 38.6 మి.మీ, చింతలపూడిలో 47.6 మి.మీ, లింగపాలెం మండలంలో 31.4 మి.మీ వర్షపాతం నమోదైంది. శనివారం రాత్రి ప్రారంభమైన వర్షం ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా జల్లులు పడ్డాయి.

మామిడి తోటలకు మేలు

భారీ వర్షం కురవడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మామిడి తోటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. దుక్కులు దున్ని, ఎరువులు వేసి తోటలకు పోషణ చేసుకోవచ్చన్నారు. అలాగే వరినార్లు పోయడానికి, మెట్ట భూముల్లో మొక్కజొన్న, మినుము తదితర పంటలు సాగుకు దోహదపడుతుందని రైతులు పేర్కొన్నారు.

ఆదివారమంతా ముసురు

ముసురు వాతావరణం నెలకొనడంతో నియోజకవర్గంలోని ప్రజలందరూ ఇళ్లకే పరిమితమయ్యారు. చిరుజల్లులు పడుతూనే ఉండటంతో ప్రజలు కూడా ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపించలేదు. అయితే ఇతర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు మాత్రం ముసురు వాతావరణంతో ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని వీధులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.

తటాకంలా మారిన జంక్షన్ రోడ్డు

పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డు చెరువులా మారింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షం నీరు రోడ్డుపైకి చేరడంతో జంక్షన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రోడ్డు నీటితో నిండిపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నీటి అడుగున ఉన్న గుంతలు కనిపించక ద్విచక్ర వాహన చోదకులు, ఆటోలు, కార్లు తదితర వాహనాల వారు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. డ్రెయినేజీలను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహించడం, డ్రెయినేజీల్లోనే చెత్తాచెదారాన్ని వేయడం, ప్లాస్టిక్ గ్లాసులు, పాలిథిన్ సంచులు తదితర వాటిని పడేస్తుండటంతో పూడిక సైతం పేరుకుపోయి వర్షం కురిసినప్పుడు నీరు డ్రెయినేజీల్లో ప్రవహించక రోడ్లపైనే నిలుస్తోందని ప్రజలు వాపోతున్నారు.


నూజివీడులో నెలకొన్న ముసురు వాతావరణం


ఆగిరిపల్లిలో ఎస్‌బీఐ వద్ద రోడ్డుపైనే నిలిచిన వర్షం నీరు

క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



తిరువూరు: స్థానిక శ్రీ సత్యసాయి సేవా సమితిలో ఆదివారం నారాయణ సేవా కార్యక్రమం నిర్వహించారు. 48 మంది వృద్ధులు, దివ్యాంగులకు సేవా సమితి కన్వీనర్ దామెర్ల ప్రభాకరరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అమ్మ ప్రేమాశ్రమంలోని వృద్ధులకు భోజన వసతి కల్పించారు. నారాయణ సేవలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని ఆయన కోరారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



తిరువూరు: స్థానిక ఆర్టీసీ బస్ డిపోలో 35 సంవత్సరాలుగా పనిచేసిన కార్మికుడు ముల్లంగి వీరయ్య పదవీ విరమణ సందర్భంగా ఆదివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కండక్టర్‌గా, డిపో క్లర్కుగా సేవలందించిన వీరయ్య ప్రయాణికులకు, కార్మికులకు విశేష సేవలందించారని కార్మిక సంఘాల నాయకులు అభినందించారు. యూనియన్ల నాయకులు ఎంవీకే రావు, స్వామి, ఏవీ రెడ్డి, రవిచంద్ర, శ్యాంసన్ తదితరులు వీరయ్యను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి స్వాగతం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ శాలువాతో సత్కరించారు. అనంతరం స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీడీపీ నాయకుడు నల్లూరి సూరిబాబు నివాసంలో ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించి 16 రోజులు పూర్తయిన సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణలతో తులసి సహస్రనామార్చన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి, అర్చకులు పర్యవేక్షించారు.

మైలవరం పంచాయతీ కార్మికుల సమ్మె

కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్


మైలవరం పంచాయతీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

మైలవరం: మైలవరం గ్రామ పంచాయతీలో గత రెండు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ అన్నారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సమ్మెలోకి దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ సర్పంచ్, కార్యదర్శితో శనివారం చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారని చెప్పారు. గత రెండు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. స్వీపర్స్‌కు రోజుకు రూ.400, డ్రైవర్స్‌కు రూ.500 చొప్పున ఇవ్వాలని ఫిబ్రవరి నెలలో కార్మికుల సమక్షంలో ఒప్పందం జరిగినప్పటికీ టెండర్లు వేసే సందర్భంగా రాజకీయ జోక్యాలతో తక్కువ టెండర్లు ఆమోదించడంతో కనీస వేతనం నెలకు రూ.10 వేలు కూడా రావడం లేదన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు నెలకు రూ.12 వేలు, ఇతర వర్కర్లకు రూ.15 వేలు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకురాలు వీరమ్మ, అంబటి శివ, చంద్రరావు, మల్లీశ్వరి, రవి, భవాని, ప్రశాంత్, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోగులకు సత్వర వైద్య సేవలందాలి

ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు


వైద్యులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు

తిరువూరు: తిరువూరు ప్రభుత్వాస్పత్రిని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు సత్వర వైద్య సేవలందించాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. అత్యవసర వైద్యం అవసరమైన రోగులకు సాధ్యమైనంత మేర సేవలందించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులు, రక్తనిధి, ఆరోగ్యశ్రీ విభాగాలను పరిశీలించారు. వైద్యాధికారి శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రాకెట్ సప్లయ్ చానల్ మరమ్మతు పనులు ప్రారంభం..


రాకెట్ సప్లయ్ చానల్ మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరువూరు: తిరువూరు మండలంలోని పలు గ్రామాల పొలాలకు సాగు నీరందించే రాకెట్ సప్లయ్ చానల్ మరమ్మతు పనులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. నీటి పారుదల శాఖ పరిధిలోని రాకెట్ సప్లయ్ చానల్ దీర్ఘకాలంగా సాగునీరందించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఏడు చెరువులకు సక్రమంగా సాగునీటి పారుదలకు పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనులను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.

సేవల ద్వారా లయనిజమ్‌నకు గుర్తింపు

లయన్స్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకర్


నూతన కార్యవర్గ సభ్యులతో నివృతరావు తదితరులు

మైలవరం: సేవల ద్వారానే లయనిజమ్‌నకు గుర్తింపు వస్తుందని లయన్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, లయన్స్ క్లబ్ ఆఫ్ నరసింహారావుపాలెం ప్లాటినం క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగింది. ఆయన మాట్లాడుతూ లయనిజమ్ అంటే సేవ అని, ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లయనిజమ్ ఉందన్నారు. మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా తిరుమలశెట్టి శ్రీధర్, సెక్రటరీగా సీహెచ్ నాగభూషణం, ట్రెజరర్‌గా నాగప్రసాద్, నరసింహారావుపాలెం క్లబ్ అధ్యక్షుడిగా చెన్నారెడ్డి, సెక్రటరీగా విజయభాస్కరరెడ్డి, ట్రెజరర్‌గా మధుసూధన్‌రెడ్డిలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా జాస్తి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ గద్దె శేషగిరి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దేవినేని కిశోర్‌కుమార్, పాస్ట్ వాయిస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ వీవీపీఎస్ ఆంజనేయులు, పాస్ట్ మల్టీపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ ఎస్వీఎస్ నివృతరావు, పీఎంసీసీ జీఎస్టీ కోఆర్డినేటర్ మూల్పూరి ఉపేంద్ర, ప్రోగ్రామ్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సీహెచ్ బాలగోపాల్‌రెడ్డి, లయన్ జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

130 మందికి వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ ట్రామా హాస్పటల్ వారు ఇబ్రహీంపట్నంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు గుండె, ఎముకలు, కిడ్నీ, మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించి 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఈసీజీ, ఎక్స్‌రే, క్రియాటిన్, హెచ్‌బీఏ 1సి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు జంపాల సీతారామయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, ప్రముఖ వైద్యులు మామిడి సీతారామారావు, మామిడి రత్నమోహనరావు, కె. పల్లవి, పూర్ణిమ, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నూజివీడు: సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు సోమవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వృద్ధాప్య పింఛన్లను జూలై నెలకు సంబంధించి రూ.4 వేలు, గత మూడు నెలల అరియర్స్ రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందిస్తారని చెప్పారు. ఏలూరు జిల్లాలో 2.68 లక్షల మందికి రూ.182.73 కోట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు.

మంత్రి కొలుసు పాల్గొనే కార్యక్రమాలు ఇవే

నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో ఉదయం 6 గంటలకు, నూజివీడు పట్టణంలోని గాంధీనగర్‌లో ఉదయం 7.30 గంటలకు, ఆగిరిపల్లిలో ఉదయం 10 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొంటారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్డీఓ వై. భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అందించిన అర్జీలను గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ బదిలీ

నూజివీడు: స్థానిక ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ఎం. రజినీని జగ్గయ్యపేట డిపోనకు బదిలీ చేస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె స్థానంలో జగ్గయ్యపేట డిపోలో పనిచేస్తున్న జి. రాంబాబును నియమిస్తున్నట్లు అదే ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు డెప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ జోన్-2 ఆదేశాలు జారీ చేశారు.

గొల్లపూడిలో ఉచిత వైద్య శిబిరం



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం బ్యాంక్ సెంటర్‌కు చెందిన గౌతమ్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో గొల్లపూడి గ్రామంలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. జనరల్, న్యూరాలజీ, ప్రసూతి, గైనకాలజీ, షుగర్, రక్తపోటు, గుండె, నరాలకు సంబంధించి డాక్టర్ ఎల్. గౌతమ్ ముఖేష్, డాక్టర్ డి. సౌమ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందచేశారు. దాదాపు వందమందికిపైగా వైద్య పరీక్షలు చేయించారు. మాజీ ఉప సర్పంచ్ చిగురుపాటి నాగరాజు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి పోలేరమ్మ తిరునాళ్ల

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల జూలై 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 12న కుంభాభిషేకం, కుంకుమ పూజ, 13న కుంభాభిషేకం, అన్నాభిషేకం, సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 14న కృష్ణానది నుంచి తీసుకువచ్చిన జలంతో కుంభాభిషేకం, పొంగలి నివేదన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా కోదండ రామాలయం వార్షికోత్సవం



కాచవరం(ఇబ్రహీంపట్నం): కోదండ రామాలయం ప్రథమ వార్షికోత్సవం కాచవరం గ్రామంలో ఆదివారం కనుల పండువగా జరిగింది. అర్చక బృందం స్వామివారికి ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవం, శాంతి హోమం, పూర్ణాహుతి తదితర పూజాదికాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్వామి వారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆలయ ట్రస్టీ బోడేపూడి అప్పారావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



రెడ్డిగూడెం: పశువులకు గాలికుంటు, గురక వ్యాధి నివారణ టీకాలను వేశారు. అలివేలుమంగాపురం గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తిరువూరు పాలశీతల కేంద్రం మేనేజర్ సాంబమూర్తి మాట్లాడుతూ పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గాలికుంటు, గురక, జబ్బవాపు తదితర వ్యాధుల నివారణకు సకాలంలో పశువులకు టీకాలు వేయించాలన్నారు. పశువుల ఆరోగ్యం, అధిక పాల ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యురాలు నెక్కలపు వాణీశ్రీ, డాక్టర్ కృష్ణారెడ్డి, రూట్ సూపర్‌వైజర్ బి. శివనాగేశ్వరరావు, సంఘ అధ్యక్షురాలు బొమ్మిన వైదేహి, సంఘ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.









● శరణు శరణు.. శాంభవి

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. శరణు శరణు.. శాంభవి అంటూ భక్తులు అమ్మ వారిని కొలిచారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మ వార్లను దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









